జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఖమ్మం
సోమవారం | 1 | జూన్ | 2026 ◆ పేజీలు : 5

## నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన ప్రముఖ కార్డియాక్ సర్జన్ డాక్టర్ అల్లాడి సృజన్

- బాధిత కుటుంబ పరిస్థితిని డాక్టర్ దృష్టికి తీసుకెళ్లిన పోతగాని పుల్లారావు



**చింతకాని, మే 31ప్రజాజ్యోతి :** మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గుర్రం నాగేశ్వరరావు కుటుంబానికి ప్రముఖ కార్డియాక్ సర్జన్ డాక్టర్ అల్లాడి సృజన్ అండగా నిలిచి తన మానవత్వాన్ని చాటుకున్నారు. కొంతకాలం క్రితం సంభవించిన మిగతా 2 లో...



## దేవుళ్లు, మతాల పేరిట...
# రాజకీయం చేయం!

- అన్ని మతాల ఆత్మగౌరవ పరిరక్షణే ప్రజా ప్రభుత్వ విధి
- రూ.3.30 కోట్లతో కూసుమంచి గణపేశ్వరాలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి
- పుష్కరాల నాటికి భద్రాద్రి పనులు పూర్తి అవుతాయని వెల్లడి

**పాలేరు ఆర్.సీ మే 31 ప్రజాజ్యోతి** దేవుళ్లు, మతాల పేరిట రాజకీయం చేయడం తమ ప్రభుత్వ విధానం కాదని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ మత సామరస్యానికి ప్రతీకగా నిలవడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ,గృహ నిర్మాణం,సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కూసుమంచి మండల కేంద్రంలోని చారిత్రాత్మక శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం (గణపేశ్వరాలయం) పునర్నిర్మాణ, అభివృద్ధి పనులకు రూ.3.30 కోట్ల వ్యయంతో ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.లతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రతి మతం ఆత్మగౌరవాన్ని, సంస్కృతిని కాపాడుతామని.. దేవాలయాలతో పాటు చర్చిలు, మసీదుల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు.ఇటీవల సమ్మక్క–సారలమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించడమే ఇందుకు నిదర్శనమన్నారు.గత ప్రభుత్వం భద్రాచలం ఆలయ అభివృద్ధికి వంద కోట్లు ఇస్తామని ప్రకటించి ఒక్క రూపాయి మిగతా 2 లో...

## రూ.5.20 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



- కొండాపురం–పొన్నెకల్లు రోడ్డు పనులకు శంకుస్థాపన...
- సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రజా ప్రభుత్వం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి....

**ఖమ్మం రూరల్ ప్రజాజ్యోతి :** ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని ముందుకు సాగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం కొండాపురం గ్రామంలో రూ.5.20 కోట్ల వ్యయంతో పొన్నెకల్లు నుండి కొండాపురం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు మిగతా 2 లో...

## రజాకార్లను తరిమికొట్టిన యోధుడు తమ్మినేని సుబ్బయ్య...

- తెల్దారుపల్లిలో సుబ్బయ్య 49వ వర్ధంతి వేడుకలు...
- సుబ్బయ్య ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలి...సీపీఎం నాయకులు తమ్మినేని వెంకట్రావు...



2 లో...

## మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- వరదల నుంచి ఖమ్మం పట్టణాన్ని రక్షించేందుకు రూ.690 కోట్లతో రక్షణ గోడల నిర్మాణం
- జూన్ నాటికి బైపాస్ రోడ్డు నుంచి కేబుల్ బ్రిడ్జి వరకు రెండు వైపులా పనులు పూర్తి చేయడమే లక్ష్యం
- రైతుల ప్రయోజనాల కోసం 14 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు
- మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**
ఖమ్మం పట్టణాన్ని వరదల ముంపు నుంచి రక్షించేందుకు చేపట్టిన మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.బైపాస్ రోడ్డు ఎఫ్.సి.ఐ. నుంచి వెంకటేశ్వర నగర్ బొక్కలగడ్డ వరకు నిర్మాణంలో ఉన్న మున్నేరు రిటైనింగ్ వాల్ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో మిగతా 2 లో...



## దేవుళ్లు, మతాల పేరిట రాజకీయం చేయం!





(మొదటి పేజీ తరువాయి...)

కూడా ఇవ్వకుండా మోసం చేసిందని మంత్రి విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాద్రి ఆలయ సమగ్ర రూపురేఖలు మార్చేందుకు రూ.350 కోట్లు కేటాయించి పనులకు శంకుస్థాపన చేశారని, వారం పది రోజుల్లోనే పనులు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. ఆలయ పరిసరాల్లో భూసేకరణ కోసమే ఇప్పటికే రూ.68 కోట్లు ఖర్చు చేశామన్నారు. రాబోయే గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.1,000 కోట్లు మంజూరు చేసిందని, అందులో భాగంగానే గణపేశ్వరాలయ పనులను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, దేవాదాయ శాఖ అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అర్చకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన ప్రముఖ కార్డియాక్ సర్జన్ డాక్టర్ అల్లాడి సృజన్




(మొదటి పేజీ తరువాయి...)

వరదల సమయంలో నాగేశ్వరరావు తన భార్యతో కలిసి బండిపై ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డారు. ఈ ఘటనలో ఆయన భార్య తీవ్ర గాయాల పాలై మృతి చెందగా, నాగేశ్వరరావు చేతికి తీవ్ర గాయమై విరిగిపోయింది. అనంతరం శస్త్రచికిత్సలు నిర్వహించినప్పటికీ చేయి పూర్తిస్థాయిలో కోలుకోలేదు. భార్యను కోల్పోయి, ఇద్దరు చిన్నారుల బాధ్యతలతో పాటు ఉపాధి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల ఈ కుటుంబం దయనీయ పరిస్థితిపై పత్రికల్లో వచ్చిన కథనాన్ని రేపల్లెవాడ గ్రామానికి చెందిన పోతగాని పుల్లారావు ప్రముఖ కార్డియాక్ సర్జన్ డాక్టర్ అల్లాడి సృజన్ దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న డాక్టర్ సృజన్ వెంటనే స్పందించి ఆ కుటుంబానికి తన వంతు సహాయం అందించేందుకు ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో డాక్టర్ అల్లాడి సృజన్ స్వయంగా రామకృష్ణాపురం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మూడు నెలలకు సరిపడా బియ్యం, కందిపప్పు, పల్లీలు, సబ్బులు తదితర నిత్యావసర సరుకులను అందజేసి కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అల్లాడి సృజన్ మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా తనకు చేతనైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అలాగే నాగేశ్వరరావు చిన్న కుమారుడి విద్యాభ్యాసానికి కూడా తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పిల్లలను బాగా చదివించి మంచి భవిష్యత్తు కల్పించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణాపురం గ్రామానికి చెందిన రామారావు, రేపల్లెవాడ గ్రామానికి చెందిన సామినేని ఫణీందర్, ప్రశాంత్, కళ్యాణ్‌తో పాటు రామకృష్ణాపురం గ్రామ యువకులు పాల్గొన్నారు.

# రూ.5.20 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి...)

ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌లతో కలిసి ఆయన ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు.

### ♦ ఆర్థిక ఇబ్బందులున్నా హామీల అమలు...

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం ఎక్కడా వెనుకడుగు వేయడం లేదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూనే, రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన రహదారుల నిర్మాణం ద్వారా ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఉపయోగపడుతుందని, కొండాపురం–పొన్నెకల్లు రోడ్డు పూర్తయితే ఈ ప్రాంత రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

### • రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ....

రైతును రాజు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల మేర (రెండు లక్షల రూపాయల వరకు) రైతు రుణమాఫీ చేశామని మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి బాధ్యత ముగించుకుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అన్ని రకాల పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని చెప్పారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ కూడా అందజేస్తున్నామని తెలిపారు.

### • జూన్ ఒకటి నుంచే ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత...

పేదలకు పక్కా గృహాలు అందించే ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడత మంజూరు ప్రక్రియ జూన్ 1 (సోమవారం) నుంచే ప్రారంభం కానుందని మంత్రి వెల్లడించారు. ఈ విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు, ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి నాలుగు విడతల్లో రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే మంజూరైన 4.50 లక్షల ఇళ్లకు సంబంధించి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నట్లు తెలిపారు.

### • రెండేళ్లలో 72 వేల మందికి ఉద్యోగాలు...

ప్రభుత్వం ఏర్పడిన తొలి రెండేళ్లలోనే 72 వేల మంది నిరుద్యోగ యువతకు నియామక పత్రాలు అందించామని మంత్రి తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల జారీ, రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, ఆర్‌డీఓ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి





(మొదటి పేజీ తరువాయి...)

కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా మున్నేరు వరదల కారణంగా పరివాహక ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఖమ్మం పట్టణాన్ని సురక్షితంగా ఉంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం 690 కోట్ల వ్యయంతో మున్నేరు రక్షణ గోడల నిర్మాణానికి ఆమోదం తెలిపిందన్నారు. మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి అధికారులు సమర్థవంతంగా పనిచేసి దాదాపు భూ సేకరణ పూర్తి చేశారని తెలిపారు. మరో 240 మీటర్ల మేర భూ సేకరణ పెండింగ్‌లో ఉందని, దానిని కూడా త్వరితగతిన పూర్తి చేసి జూన్ నెల నాటికి బైపాస్ రోడ్డు నుంచి కేబుల్ బ్రిడ్జి వరకు కుడి, ఎడమ వైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. బైపాస్ రోడ్డు నుంచి కేబుల్ బ్రిడ్జి వరకు అత్యధికంగా పేద ప్రజలు నివసించే ప్రాంతమని, జూలై, ఆగస్టు నెలల్లో వచ్చే వరదల సమయంలో మున్నేరు జలాలు పట్టణంలోకి ప్రవేశించకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 2027 మార్చి నాటికి మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత సంవత్సరంలో బైపాస్ రోడ్డు నుంచి కేబుల్ బ్రిడ్జి వరకు రెండు వైపులా రక్షణ గోడల నిర్మాణం పూర్తయితే ప్రజలకు గణనీయమైన భద్రత కలుగుతుందని, ఆ పనులను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని సూచించారు. అనంతరం పాత్రికేయుల ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ రాష్ట్రంలో ఇప్పటివరకు 14 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట కొనుగోలు చేశామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో భారీ స్థాయిలో మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయని చెప్పారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం కొనుగోళ్లు కొనసాగిస్తోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు, ఎండల తీవ్రత తదితర కారణాలతో కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ ఖమ్మం జిల్లాలో అత్యధికంగా పంట కొనుగోళ్లు జరిగాయని తెలిపారు. అవసరమైతే సరిహద్దు ప్రాంతాల్లోని గోదాములను కూడా వినియోగిస్తూ ప్రభుత్వం పంట సేకరణ కొనసాగిస్తోందన్నారు. క్వింటాల్‌కు వెయ్యి రూపాయలకు పైగా నష్టం వచ్చినప్పటికీ రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం మొక్కజొన్న పంటను కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో 65 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు జరిగిందని, దేశం మొత్తం కూడా 50 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు జరగలేదని ఈ అంశాలను గమనించుకోవాలని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రజాకార్లను తరిమికొట్టిన యోధుడు తమ్మినేని సుబ్బయ్య...

**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తెల్దారుపల్లి గ్రామాన్ని జాగీర్దార్ చెర నుంచి గ్రామాన్ని విముక్తి చేసిన పోరాట యోధుడు తమ్మినేని సుబ్బయ్యని సీపీఎం నాయకులు తమ్మినేని వెంకట్రావు అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లి గ్రామంలో తమ్మినేని సుబ్బయ్య 49వ వర్ధంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో తమ్మినేని వెంకట్రావు మాట్లాడుతూ...గ్రామాన్ని జాగీర్దార్ రాక్షస పాలన నుంచి విముక్తి చేసేందుకు రైతులు, యువకులతో కలిసి జాగీర్దార్ ను గ్రామం నుంచి తరిమికొట్టిన వీరుడు సుబ్బయ్య అన్నారు. జాగీర్దార్ చెరలో ఉన్న నాలుగు వందల ఎకరాలను పేద ప్రజలకు పంచి గ్రామాన్ని తన కుటుంబంలా చూసుకున్న మహనీయుడు సుబ్బయ్య అన్నారు. సుబ్బయ్య ఆశయ సాధన కోసం గ్రామ యువత కృషి చేయాలని



కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెండ్యాల సుమతీ, మడిపల్లి వెంకన్న, మల్లెబోయిన రాజశేఖర్, దోనోజు పాపయ్య, లక్ష్మయ్య, గోవిందయ్య, జాలారు సంగయ్య, టేకుమట్ల సీతమ్మ, మొగిలిశెట్టి సరస్వతి, సావిత్రి, సైదమ్మ, ఉమ, భూక్య హర్యా, పగిడిపల్లి ఉపేందర్, మర్రి బాబు, సన్మతి రావు, జక్కంపూడి సైదులు, గుంటి వెంకన్న, దొనకొండ ముత్తయ్య, గుంటి వెంకన్న పాల్గొన్నారు.

# రైతు డిస్కం పేరుతో రేవంత్ ప్రభుత్వం కొత్త నాటకం

- గౌరవరపు జగదీష్
- తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న రైతు డిస్కం నిర్ణయాన్ని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ వ్యతిరేకిస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ పాలనకి, రైతులు బలవుతు న్నారు
- తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి




**వైరా మే 31 ప్రజా జ్యోతి** రైతు డిస్కం పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచే కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) వైరా నియోజకవర్గ ఇన్చార్జి గౌరవరపు జగదీష్ మండిపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, విద్యుత్ సంస్కరణల పేరుతో రైతు డిస్కం, రైతుల పాలిట శాపంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డిస్కమ్ ఏర్పాటు వ్యవసాయంపై ఎంట్రీన్ చల్లడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రైతులకు మంచి చేసే ఆలోచనలో ఉంటే ఆరు నెలలుగా ఈ విషయాన్ని ఎందుకు దాచి ఉంచిందో చెప్పాలన్నారు. యావత్ తెలంగాణ రైతాంగానికి అన్యాయం చేసే ప్రయత్నాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణలో రైతు ఉద్యమం ఉప్పెనగా మారుతుందన్నారు. రైతుల భవితవ్యాన్ని నిర్ణయించే ఈ అంశంపై 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఏ విధంగానూ వయిబుల్ కాని ఈ ప్రపోజల్ ను తిరస్కరించాలని ఈఆర్సీకి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. రైతు డిస్కమ్ పేరుతో ప్రభుత్వం పచ్చి దగా చేస్తోందని అన్నారు. ప్రభుత్వం అస్మర్థత కారణంగా రైతుల పంట కల్లాల్లో తడిసిపోయిందని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలని జగదీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దొడ్డిదారిన తలపెట్టిన డిస్కం ఈఆర్సీ కారణంగా బయటకు వచ్చిందే తప్ప ప్రభుత్వం బయట పెట్టలేదని గుర్తు చేశారు. అసలే డిస్కమ్ ల పరిస్థితి బాగాలేని సమయంలో 25 వేల కోట్ల నష్టంతో ఉన్న డిస్కమ్ ను కంపెనీ పేరుతో ఎలా రిజస్టర్ చేస్తారని నిలదీశారు. రైతులకు ఇచ్చే ఫ్రీ కరెంట్, ఉచిత విద్యుత్ స్కీం, లిఫ్ట్ ఇరిగేషన్ కోసం వాడే పవర్ కు ప్రభుత్వమే డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. అలాంటప్పుడు ఈ సంస్థ ఏవిధంగా లాభాల్లో ఉంటుందో చెప్పాలన్నారు. కేవలం రైతులకు నష్టం చేసేందుకు ప్రభుత్వం పూనుకుందని జగదీష్ విమర్శించారు. కొత్త డిస్కంకు 42 శాతం లోడ్ ట్రాన్స్ఫార్మర్ చేస్తామని ప్రభుత్వం చెబుతోందని, అందుకు తగిన విధంగా ఉద్యోగులను మాత్రం కేటాయించటం లేదన్నారు. మొత్తం డిస్కంలలో 45 వేల మంది ఉద్యోగులు ఉంటే కొత్త డిస్కంకి 2 వేల మంది ఉద్యోగులను మాత్రమే బదిలీ చేస్తామంటున్నారన్నారు. సిబ్బంది కొరతతో ట్రాన్స్ ఫార్మర్లు రిపేర్ వస్తే రెండు నెలల పాటు ఎదురుచూసే పరిస్థితి వస్తుందన్నారు. తెలంగాణలో 29 లక్షల బోర్లు ఉన్నాయని కొత్త డిస్కం కారణంగా ఆయా బోర్ల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డిస్కంల బకాయిలు 69 వేల కోట్లు ఉంటే అందులో 54 వేల కోట్ల బకాయిలు ప్రభుత్వం నుంచే రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు చెల్లిస్తే మన డిస్కమ్ లు అభివృద్ధిలోకి వస్తాయని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ వైరా అధ్యక్షులు గున్నాల సురేష్ గౌడ్, దాసరి హరీష్, భరత్, కొండా, కృష్ణ ఉన్నారు.


## కందుకూరు లో చాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణ





**వేంసూరు మే 31 ప్రజాజ్యోతి** కందుకూరు గ్రామంలో నేడు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని అంగరంగ వైభవంగా ఆవిష్కరించడం జరిగింది గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ రాయల సత్యం రజక సోదరులు, అన్ని సామాజిక వర్గాల ప్రజలు కలిసికట్టుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం చాకలి ఐలమ్మ ఆశయాలకు నిజమైన నివాళి. దొరల పెత్తందారీకి, నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి నిలబడి "అన్యాయానికి తలవంచేది లేదు" అని చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్న మహావీరనారి చాకలి ఐలమ్మ. తన కుటుంబం ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నా, తన పోరాటాన్ని ఆపలేదు. బడుగు, బలహీన వర్గాలకు ఆత్మవిశ్వాసాన్ని నింపి, అణగారిన ప్రజల హక్కుల కోసం చివరి వరకు పోరాడిన యోధురాలు. తెలంగాణ ఉద్యమం నుంచి నేటి సామాజిక న్యాయ పోరాటాల వరకు ప్రతి అడుగులోనూ చాకలి ఐలమ్మ స్ఫూర్తి కనిపిస్తుంది. అందుకే ఆమెను కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం చేయకుండా తెలంగాణ జాతి గర్వంగా గుర్తించాలి. ప్రభుత్వం చాకలి ఐలమ్మ సేవలను మరింత ఘనంగా గుర్తించి, ఆమె పేరును ఒక జిల్లాకు నామకరణం చేయాలని, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాము. గ్రామ గ్రామాన చాకలి ఐలమ్మ విగ్రహాలు నెలకొల్పి యువతకు ఆమె పోరాట చరిత్రను తెలియజేయాలి. నేటి యువత చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ, త్యాగ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షులు బానోతు విజయ్ , డాక్టర్ పెద్ది రాజు , మంద శివ సత్తుపల్లి నియోజకవర్గ బీసీ సంఘాల అధ్యక్షులు కోమటి తిరుమలరావు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాయల రిషి గారు, రాయల వెంకటేశ్వరావు, పాలకొల్లు శ్రీనివాస్ రావు, ఎదుళ్ళ మురళి, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బకు వానరం మృతి... ఘనంగా అంత్యక్రియలు





**నేలకొండపల్లి, మే 31 ప్రజా జ్యోతి :** ఎండ తీవ్రత కు వానరం మృతి చెందటంతో... గ్రామస్తులు అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు. మండలం లోని మంగాపురంతండా లో ఆదివారం ఓ వానరం ఎండ తీవ్రత కు గ్రామస్తు లు చూస్తుండుగానే... ప్రధాన సెంటర్ లో కుప్పకూలింది. గత కొంత కాలం నుంచి గ్రామంలో రామాలయం దగ్గర నిత్యం సంచరిస్తుంది. రామాలయం వద్ద ఎండ దెబ్బకు మృతి చెందటంతో గ్రామస్తులు వానరంకు కుంకమ్మ చల్లి... డప్పు వాయిద్యాలతో... అంత్యక్రియలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహాకార సంఘం ఉపాధ్యాక్షుడు దీర్ఘావత్ రాధాకృష్ణమూర్తి, కోటేశ్వరరావు, నాగరాజు, తేజావత్ శంకర్, బీ.వెంకటేశ్వర్లు, తేజావత్ మల్లిఖార్జున్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## 3 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు



**నేలకొండపల్లి, మే 31 ప్రజా జ్యోతి:** కానిస్టేబుల్ బాణోత్ ప్రసాద్ జ్ఞాపకార్థం ఈ నెల 3 నుంచి జిల్లా స్థాయి. క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆజ్వండా యూత్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు.... కానిస్టేబుల్ ప్రసాద్ ను స్మరించకుంటూ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో యువత లో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికితీసేందుకు తండా యూత్ కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 3 నుంచి జిల్లా స్థాయి లో క్రికెట్ టోర్నమెంట్ కి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కావునా ఆసక్తి గల క్రీడాకారులు పోటీలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విజేతలకు షీల్డ్, నగదు బహామతులను అందించనున్నట్లు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో ఆజయతండా యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## పుష్పలంకరణ వేడుక మహోత్సవంలో పాల్గొన్న తిర్లాపురం గ్రామ సర్పంచ్



**చింతకాని మే31ప్రజాజ్యోతి :** మండల పరిధిలో నాగులవంచ గ్రామంలోని శ్రీ వంకాయలపాటి రామయ్య ఫంక్షన్ హాల్ నందు తిర్లాపురం గ్రామానికి చెందిన గోదా రామారావు–సరిత దంపతులు, కుమార్తె సుష్మా స్వరాజ్ పుష్పలంకరణ –ఓడినింపు వేడుక మహోత్సవంలో తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు పాల్గొని చిన్నారులను అక్షింతల వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీర బాబు, తిర్లాపురం బిఆర్ఎస్ నాయకులు గోగుల నరసింహారావు, బండి రామారావు, గోద రవీందర్, బండి సైదులు, స్వర్ణ కంటే నాగేశ్వరావు, గోదా ప్రసాదు, గోదా వెంకన్న, గోద వీరేందర్, గోదావీరబాబు, బండి గోపీనాథ్, బండి యాకోబ్, రెడ్డి బోయిన రామారావు, చింతల రామకృష్ణ, మడిపల్లి గోపి లాల్, మడిపల్లి రామకృష్ణ , మడిపల్లి మంగరావు, మడిపల్లి పెంటయ్య, మరీదు భూపతి రావు, మరీదు రామ్ –లక్ష్మణ్ గోగుల పెంటయ్య, గోగుల నవీన్, పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలి

- ఓటర్ల సవరణ పై అవగాహన కల్పించాలి



**నేలకొండపల్లి, మే 31 ప్రజా జ్యోతి:** దేశాభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని బీజెపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మన్ కి బాత్ కార్యక్రమం ను ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... ప్రభుత్వ పథకాల పై ప్రజలలో చైతన్యం కల్పించాలని సూచించారు. ఓటర్ల సవరణ, ఎస్.ఐ.ఆర్. కార్యక్రమం పై అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాల గురించి ఇంటింటా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. మన్ కి బాత్ కార్యక్రమంలోని ప్రధాన అంశాల ను క్షేత్ర స్థాయిలో ప్రచారం నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పథకాలకు కేంద్రం అందించే నిధుల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు సరిపడా సొసైటీలలో సిద్ధంగా ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, ఉపాధ్యాక్షుడు పురాణం దివాకర్, కొండా హర్షవర్ధన్, కందరబోయిన గోపి, ఎలిగేటి వెంకటేష్, తొగాటి నాగచారీ, పిట్టల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన రాయల



**నేలకొండపల్లి, మే 31 ప్రజా జ్యోతి :** మండలం లోని కోరట్లగూడెం లో ఆదివారం చిన్నారులను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆశీర్వదించారు. గ్రామం లోని బచ్చలకూరి నాగేశ్వరరావు–సునీత కుమారుడు, కుమార్తె కార్తీక్, కార్తీక ల పుష్పాలంకరణ, పంచెకట్టు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మేడే స్ఫూర్తి నిత్యం ఆచరణలో ఉండాలి

- పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు



**బోనకల్, మే 31 (ప్రజా జ్యోతి):** మేడే స్ఫూర్తి నిత్య జీవితంలో ఆచరణలో ఉండేలా సమాజంలో మార్పు కోసం పోరాడాలని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. ఆదివారం సిపిఎం కార్యాలయంలో మేడే స్ఫూర్తి – నిత్య ఆచరణ అంశంపై సెమినార్ నిర్వహించారు. స్టడీ సర్కిల్ కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. 1886 చికాగో నగరంలో హే మార్కెట్ లో రక్తం చిందించి ప్రాణత్యాగంతో కార్మికులు పోరాడి సాధించుకున్న విజయం గుర్తుగా ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు అందరూ మే ఒకటో తేదీన జరుపుకునే పండుగ మేడే అన్నారు. కుల,మత,వర్గ,వర్ణ ,లింగ,ప్రాంతీయ భేదాలతో సంబంధం లేకుండా మనుషులందరూ అంతర్జాతీయ దృక్పథంతో ఐక్యంగా వేడుకలా మేడే స్ఫూర్తి నిత్యం నిలిచి ఉంటుందన్నారు. ఎనిమిది గంటల పని, ఎనిమిది గంటల విశ్రాంతి, ఎనిమిది గంటల వ్యక్తిగత జీవితం ఉండాలనే హక్కు సాధించినా నేటికీ ప్రపంచ వ్యాప్తంగా శ్రమ దోపిడీ కొనసాగుతుండడం దుర్మార్గం అన్నారు. మనిషి పని, విశ్రాంతి సమయం పోగా మిగిలిన ఎనిమిది గంటల సమయంలో తనను తాను చైతన్యపరచుకుంటూ శ్రమ జీవులు ఎలా దోపిడీకి గురవుతున్నారనేది చైతన్యపరచాలన్నారు. ఈ కార్యక్రమం సమిష్టిగా, పట్టుదలతో, దీక్షగా చేయాలన్నారు. మేడే స్ఫూర్తి ఒక్క రోజు పండుగలా జరుపుకునేది కాదని వర్గరహిత సమాజం ఏర్పడేదాకా, ఏర్పడిన తరువాత కూడా కొనసాగించాల్సిన బాధ్యత మనుషులందరిపైనా ఉందన్నారు. టెక్నాలజీ పెరిగేకొద్దీ పని గంటలు తగ్గాలి తప్ప పెరగకూడదనీ, పెట్టుబడి వికృత చేష్టలు ఫలితంగా పని వేళలు, పని గంటలకు అదుపు లేకుండా మానవీయ విలువలు విధ్వంసం అవుతున్నాయన్నారు. సాఫ్ట్వేర్ రంగంలో మనిషి తనను తాను కోల్పోతుండడం బాధాకరం అన్నారు. దోపిడీ రహిత సమాజం కోసం కృషి చేయడం ద్వారా మేడే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిలార్ సురేష్, బంధం శ్రీనివాసరావు, జొన్నలగడ్డ సునీత, కూచిపూడి మురళి, గూగులోతు నరేష్, బూర్గుల అప్పచారి, చలమల హరికిషన్, బొప్పాల రమేష్, చేపూరి వెంకటేశ్వర్లు, ఎస్కే షీలార్, ఉప్పర శ్రీను, బోయినపల్లి వీరబాబు, కుక్కల కోటేశ్వరరావు, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఓణీల ఫంక్షన్ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వాదించిన తహసీల్దార్



**చింతకాని మే31 ప్రజాజ్యోతి ప్రతినిధి :** కొణిజర్ల మండలం బస్వాపురం గ్రామంలో జరిగిన చింతకాని మండలం నేరడ రెవిన్యూ జిపిఓగా పనిచేస్తున్న వెంకటేష్ కుమార్తె ఓణీల ఫంక్షన్ కార్యక్రమంలో మండల తాసిల్దార్ బాబ్జి ప్రసాద్,మండల ఆర్ఐ ఏకవీర, సిపిఐ మండల కార్యదర్శి దుసరి గోపాలరావు నేరడ గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ కొప్పుల గోవిందరావు నేరడ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు మంకెన నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన కుటుంబాలకు ఆర్థిక సాయం అందించిన - పొంగిలేటి ట్రస్ట్



**తిరుమలాయపాలెం : మే 31 ప్రజా జ్యోతి** తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయి గ్రామంలో నవంబర్ నెల నుండి ఏప్రిల్ నెల వరకు మరణించిన కుటుంబాలకు 10,000 రూపాయలు పి ఎస్ ఆర్ ట్రస్ట్ ద్వారా రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రివర్యులు శ్రీ పొంగిలేటి శ్రీనివాసరెడ్డి గారు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీరామ సాయం నరేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొప్పుల అశోక్, మాజీ ఎంపీపీ మంగీలాల్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, వార్డ్ మెంబర్ కొత్తపెల్లి ఉష, ఫ్యాక్స్ మాజీ డైరెక్టర్ గుండాల లింగయ్య, కొత్తపెల్లి మల్లయ్య , మోరపాక నాగయ్య , తవడబోయిన కృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మేరీ మాత మహోత్సవం వైభవంగా ఊరేగింపు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం నగరంలోని వైరా రోడ్డులో గల ప్రముఖ 'జాన్ ముజ్జుకోని చర్చి'లో మే నెల 31న మేరీ మాత మహోత్సవ పండుగ అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో జరిగింది. మరియమత ఎలిజిబెత్ను సందర్శించిన పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకొని ఈ ప్రత్యేక మహోత్సవాన్ని నిర్వహించారు. లోక రక్షకుడైన ఆ గొప్ప దేవుడిని భూమికి ప్రసాదించిన పరమ పవిత్రమైన తల్లిగా మేరీ మాతను కీర్తిస్తూ భక్తులు ఈ వేడుకను ఘనంగా జరుపుకున్నారు.ఈ పండుగ సందర్భంగా జాన్ ముజుకోని చర్చిలో మేరీ మాత ఊరేగింపు మహోత్సవం మహా ఘనంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై మేరీ మాత విగ్రహాన్ని ఉంచి, పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.ఈ ఊరేగింపులో ఖమ్మం నగరంతో పాటు పరిసర ప్రాంతాల నుండి వేలాది మంది క్రైస్తవ సోదరులు,భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.మాతా మేరీ ఆశీస్సులతో సమాజంలో శాంతి,కరుణ,సామరస్యం వర్ధిల్లాలని ఈ సందర్భంగా చర్చి ధర్మకర్తలు,ఫాదర్స్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇంతటి పవిత్రమైన ఊరేగింపు మరియు మహోత్సవాన్ని ఎంతో నిష్ఠతో,విజయవంతంగా జరుపుకున్నందుకు... ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేసిన భక్తజనులకు, ప్రజలందరికీ చర్చి కమిటీ ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఖమ్మం లో మహమ్మద్ జావీద్ సంతాప సభ నేతల ఘన నివాళి



**కల్లూరు, మే 31 ప్రజా జ్యోతి** ఖమ్మం నగరంలోని వైఎస్ఆర్ కాలనీలో ఆదివారం మహమ్మద్ జావీద్ సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని జావీద్ కి ఘనంగా నివాళులర్పించారు. సంతాప సభకు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సిరాజుద్దీన్, జిల్లా కార్యదర్శి శీలం బ్రహ్మారెడ్డి హాజరై జావీద్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారితో పాటు ఎస్.కె ఇమ్రాన్ హుస్సేన్, మతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొని జావీద్ గారితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. నేతలు మాట్లాడుతూ, మహమ్మద్ జావీద్ సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన మృతి తీరని లోటు అని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సంతాప సభలో స్థానికులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## మహ్మాద్ జావిద్ సంతాప సభకు నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

**చింతకాని మే31 ప్రజాజ్యోతి :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన టీపీసీసీ సభ్యుడు ,ఖమ్మం నగర పార్టీ మాజీ అధ్యక్షుడు జావీద్ సంతాప సభ కార్యక్రమంలో పాల్గొని, వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి జావీద్ సేవలను స్మరించుకుంటూ,వారి ఆత్మకు శాంతి చేకూరాలని, అలాగే వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి,మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలస్యం బసవయ్య,నెల్లూరి రమేష్,గజ్జల వెంకన్న, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



## మధిర మున్సిపల్ చైర్మన్ ను సత్కరించిన జర్నలిస్టు మల్లూరు

- ప్రజా అభివృద్ధి లో ముందుకు సాగాలి
- బాల్య స్నేహం మరువలేనిది



**వేంసూరు,మే31 ప్రజాజ్యోతి** ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ కేంద్రం మున్సిపాలిటీ చైర్మన్ సామినేని సుజాత రామనాథం లను జర్నలిస్టు,సీఐటీయూ నేత, ఎస్ బి ఐ లైఫ్ మిత్ర మల్లూరు చంద్రశేఖర్ శాలువా కప్పి సత్కరించారు.మధిర మున్సిపాల్టీ పరిధిలోని ఇల్లెందలపాడు గ్రామంలో గల చైర్మన్ స్వగృహంలో మల్లూరు కలసి సుజాత ను మున్సిపాల్టీ చైర్మన్ గా విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు.ప్రజా అభివృద్ధి లో రాజకీయాలకతీతంగా ముందుకు సాగాలని మున్సిపాల్టీ పరిధిలోని ప్రజలకు ఉత్తమ సేవకురాలిగా పని చేసి ప్రజా అభిమానాన్ని చురగొనాలని 2031 లో జరగనున్న మున్సిపాల్టీ ఎన్నికలలో మరోసారి ఏకగ్రీవంగా గెలుపొందేదానికి ఇప్పటి నుండే కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా మల్లూరు మీడియాతో మాట్లాడుతూ సత్తుపల్లి మండల పరిధిలోని తమ స్వగ్రామం సదాశివునిపాలెం లో సుజాత తను బాల్యం నుండి గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో కలసి చదువుకున్నామని సోదర భావంతో కలిసి మెలిసి ఉన్నామని ఒక తల్లి బిడ్డల లా విద్యార్థి దశలో ఆటలు ఆడుతూ గడిపామని ఇద్దరి ఇండ్లు పక్క పక్కనే ఉండేవని తెలిపారు.మాకు రాజకీయాలు వేరైనా బాల్య స్నేహం జీవితంలో మరువలేనిదని ఎప్పటికీ సోదరీ సోదరులుగా ఉంటామని స్పష్టం చేశారు.చైర్మన్ సుజాత దంపతులను కలిసిన వారిలో మల్లూరు తో పాటు మల్లూరు మిత్రులు తుంగా నాగరాజు,కువ్వారాపు నాగేశ్వరరావు లు వున్నారు.

## వడ దెబ్బకు గ్రామ పంచాయతీ కార్మికుడు మృతి



**చింతకాని మే 31ప్రజాజ్యోతి :** నాగులవంచ గ్రామ పంచాయితీ ట్రాక్టర్ డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న పాడిశాల గోపయ్య ఆదివారం వడ దెబ్బ కారణంగా మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలియజేసారు పాడిశాల గోపయ్య మరణం పట్ల గ్రామ ప్రజలు కుటుంబ సభ్యులు మరియు గ్రామ రాజకీయ నాయకులు బావోగ్వేదానికి లోనైనారు. గ్రామ ప్రజలు వివిధ పార్టీ నాయకలు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.

# అక్షరాల స్నేహానికి 'నాలుగు దశాబ్దాల' బంధం..

- సుబ్లేడ్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం!
- 39 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి చేరిన 1986-87 బ్యాచ్ పదో తరగతి స్నేహితులు
- ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ భావోద్వేగం
- ప్రస్తుత జీవిత కష్టసుఖాలు పంచుకుంటూ ఆనందంలో మునిగిన మిత్రులు



**తిరుమలాయపాలెం 31 మే (ప్రజా జ్యోతి)** కాలం మారింది.. వయసు పెరిగింది.. జీవిత ప్రయాణంలో ఎవరి దారులు వారు వెతుక్కుంటూ ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. కానీ, నాటి పాఠశాల రోజుల్లో చిగురించిన ఆ అక్షరాల స్నేహం మాత్రం చెక్కుచెదరలేదు. దాదాపు 39 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత, ఆ బాల్య మిత్రులంతా ఒకే చోట చేరి అప్పటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. తిరుమలాయపాలెం మండల పరిధిలోని సుబ్లేడ్ గ్రామంలో 1986-87 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సమ్మేళనం ఆదివారం స్థానికంగా అత్యంత ఘనంగా, హృదయపూర్వక వాతావరణంలో జరిగింది.

### ››› కాల చక్రం వెనక్కి తిరిగిన వేళ..

చిరునవ్వులు, ఆలింగనాలు, ఆత్మీయ పలకరింపుల మధ్య సాగిన ఈ సమ్మేళనంలో నాటి క్లాస్‌రూమ్ జ్ఞాపకాలు మళ్లీ సజీవంగా మారాయి. ముఖంపై ముడతలు పడినా, తలలు పండినా.. ఒకరినొకరు పేర్లతో పిలుచుకుంటూ మళ్లీ పాఠశాల రోజుల్లోని బాల్యానికి వెళ్ళిపోయారు. నాటి అల్లరి పనులు, గురువుల పాఠాలు, పరీక్షల నాటి భయాలు ఒకరితో ఒకరు పంచుకుంటూ మైమరచిపోయారు. ప్రస్తుతం తాము జీవితంలో అనుభవిస్తున్న కష్టసుఖాలను, సాధించిన విజయాలను మిత్రులతో పంచుకుంటూ పరస్పరం భరోసా ఇచ్చుకున్నారు.

### ››› తరగని స్నేహ బంధం..

ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. ఎన్ని ఏళ్లు గడిచినా, జీవితంలో ఎంతటి ఉన్నత స్థానాలకు చేరుకున్నా బాల్య స్నేహానికి సాటి రాదని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ వయసులో మళ్లీ స్నేహితులందరినీ కలిసి ఒకే వేదికపై సమయం గడపడం తమ జీవితంలో మర్చిపోలేని మధురమైన రోజని ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ఇలాగే కలుస్తూ, ఒకరికొకరు అండగా నిలవాలని ఈ సందర్భంగా వారంతా ఆకాంక్షించారు. రోజంతా ఆటపాటలు, ఉల్లాసంగా గడిపిన మిత్రులు, చివరగా ఒకరికొకరు వీడ్కోలు పలుకుతూ గ్రూప్ ఫోటోలు దిగి ఈ రోజటి జ్ఞాపకాలను కెమెరాల్లో భద్రపరుచుకున్నారు. కార్యక్రమం అంతటి ముందుండి నడిపించిన గంధసిరి వెంకన్న, గండమల్ల రాజయ్య బుక్క శ్రీను, మల్లారెడ్డి వీరయ్య, సోమయ్య, శ్రీనివాస్ రెడ్డి, దామల్ల వెంకట రాములు, చంద్రకళ యస్ లీలావతి ఆర్ తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ అడ్మినిస్ట్రేటర్‌గా సంపత్ కుమార్ సేవలు అభినందనీయం

- మున్సిపల్ చైర్మన్ సుజాత



**మధిర ప్రజా జ్యోతి** మున్సిపల్ అడ్మినిస్ట్రేటర్‌గా సంపత్ కుమార్ మధిర మున్సిపాలిటీకి అందించిన సేవలు అభినందనీయం అని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత అన్నారు.ఆదివారం బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ అరెగల సంపత్ కుమార్ కు మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత ఆత్మీయ వీడ్కోలు పలికి, శాలువాతో ఘనంగా సన్మానించారు.తెలంగాణ ప్రభుత్వం మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు మేరకు మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ మధిర నుండి మల్కాజిగిరి కార్పొరేషన్ కు బదిలీ అయ్యారు.ఈ మేరకు కమిషనర్ సంపత్ కుమార్ కు మధిర మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సుజాత సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి సాదరంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా చైర్మన్ సుజాత మాట్లాడుతూ,ఒక సమర్థవంతమైన మున్సిపల్ అడ్మినిస్ట్రేటర్‌గా సంపత్ కుమార్ మధిర పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక వసతుల కల్పన మరియు ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో పాటు అంతరాయం లేకుండా సురక్షితమైన తాగునీటిని అందించడానికి అవసరమైన ఏర్పాట్లు వేశారని అన్నారు.అలాగే అభివృద్ధి పనుల కోసం ఆస్తి పన్ను,వాణిజ్య లైసెన్సులను సకాలంలో వసూలు చేసి,మున్సిపాలిటీకి ఆదాయాన్ని సమకూర్చారని,2024 నుంచి 2026 మే చివరి వరకు ఆయన అందించిన సేవలు కొనియాడారు.బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని, వారి పరిపాలనా దక్షతతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మిరియాల వెంకటరమణ గుప్తా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్,సామినేని రామనాథం,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కోదుమురు మాజీ సర్పంచ్ నారపోగు బాలస్వామి నాలుగో వర్ధంతి

**చింతకాని మే31 ప్రజాజ్యోతి ప్రతినిధి :** భారత కమ్యూనిస్టు పార్టీ చింతకాని మండల మాజీసహాయ కార్యదర్శి కొదమూరు మాజీ సర్పంచ్ నారపోగు బాలస్వామి నాలుగో వర్ధంతి ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపూడి రవిఅధ్యక్షత వహించినారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎక్స్ జెడ్పిటిసి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్‌గారు జండా ఆవిష్కరణ చేశారు మాట్లాడుతూ కుదుమూరు గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించిన నాటి నుంచి చనిపోయే వరకు కూడా4 సర్పంచ్ 2ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా గెలవడం కోసం తన శక్తివంచిన లేకుండా కృషి గెలిపించుకున్నారని ఎమ్మెల్యే ఎంపీ ఎలక్షన్లో కూడా ప్రత్యర్థి కంటే ఎక్కువ ఓట్లు సాధించారని గొప్ప పోరాట యోధుడని బాలస్వామి గారిని కొనియాడారు సర్పంచ్ చేసిన కాలంలో కూడా పువ్వాడ గారు బట్టి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పరిచారని వారికి చాలా సన్నిహితంగా మెలిగారని ఇప్పటికి కూడా కొదుమూరు గ్రామ నాయకులు ఎవరైనా పువ్వాడ నాగేశ్వరరావు గారి దగ్గరకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క గారికి వెళ్ళినప్పుడు బాలస్వామి గారిని గుర్తు చేసుకుంటారని తను మనకు దూరమై నాలుగు సంవత్సరాలు అవుతున్నా కూడా తను నాయకుల కార్యకర్తలు మనసులో ఇంకా బతికే ఉన్నాడని కొనియాడారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ గారు కూచిపూడి రవి గారు జిల్లా సమితి ఎక్స్ సర్పంచ్ రాసాల మోహన్‌రావు గారు ఎక్స్ ఎన్ పి టి సి నారపోగు హేమ నాగార్జున గారు రైతు సంఘం చింతకాని మండల అధ్యక్షులు దొబ్బల వెంగళ రావు గారు ఎక్స్ సర్పంచులు పాతూరి లక్ష్మీ



వెంకటేశ్వర్లు నక్కన బోయిన సుజాత కృష్ణ శాఖ కార్యదర్శి నీరుడు గోవిందరావు కొదమూరు ఎక్స్ ఉపసర్పంచ్లు కోటగిరి పరభూషణాచారి అనుబోతు వీరబాబు బసవపురం సర్పంచ్ ఆవుల నరసింహారావు బసవపురం ఎక్స్ ఎం పి టి సి మార్గం శ్రీనివాసరావు ఉప సర్పంచ్ చంద్ర కానీ నరసింహారావు రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ వేముల సతీష్ మాజీ చైర్మన్ బోయిని రవి కొదమూరు గ్రామ శాఖ సహాయ కార్యదర్శులు సేలం ఉపేందర్ చల్లగుండ్ల సాయి జనగాం వెంకటేశ్వర్లు చంద్రకాని వెంకన్న బొల్ల భాను గాడిదుల అనిల్ కూచిపూడి సందీప్ చల్లగుండ్ల వెంకటేశ్వర్ల నారపోగు వసంతరావు నారు పోగు కొండలు ,నారపోగు శ్రీను నారపోగు చిన్నప్ప నేరేడు విశ్వనాథం వీరుడు కృష్ణ కుక్కల శ్రీకాంత్ కంపెల్లి జయరాజ్ చిట్టి మోదు నవీన్ కోటగిరి వీరయ్య గడ్డం నాగభూషణం కాంగ్రెస్ నాయకులు నీరుడు తిరుపతిరావు నీరుడు మధు తదితరులు పాల్గొన్నారు

# భక్తులతో బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్, ఫాదర్ కొమ్ము ఆంతోనీ

- పాలేరులో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక వైభవం.





**పాలేరు ఆర్.సీ మే 31 ప్రజా జ్యోతి** పాలేరు నియోజకవర్గంలోనే కూసుమంచి మండల పరిధిలోని పాలేరు గ్రామంలో అద్భుతాల మేరీ మాత పుణ్యక్షేత్రంలో గత ఏడు రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వైభవం వెల్లివిరిసింది. పాలేరు విచారణ గురువు ఫాదర్ కొమ్ము ఆంతోనీ పర్యవేక్షణలో ఈనెల 24వ తేదీతో ప్రారంభమైన పుణ్యక్షేత్ర మహోత్సవాల్లో ప్రతిరోజు ప్రత్యేక మత గురువులచే స్వస్థత ప్రార్థనలు , ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలలోభాగస్వాములయ్యారు. తొలి రోజు 24వ తేదీన ఖమ్మం మేత్రాసనం కోశాధికారి ఫాదర్ సురేపల్లి ఐజక్ ఉత్సవాలను ప్రారంభించగా బిషప్ సెక్రటరీ ఫాదర్ విజయ్ కుమార్, ఫాదర్ కొమ్ము ఆంటోనీ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతిరోజు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మత గురువులు ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రసంగాలు భక్తులను మంత్రముగ్ధులు చేశాయి. ముగింపు వేడుకలలో శనివారం ఉమ్మడి జిల్లా మేత్రాసనం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆధ్యాత్మిక దైవ సందేశం అందరినీ ఆధ్యాత్మిక భక్తి సాగరంలో ఓలలాడించింది. మరియతల్లి తేరుప్రదక్షిణ లో వేలాది మంది భక్తులు వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొనడం , 76 అడుగుల దైవమాత మేరీమాత స్వరూపాన్ని తిలకించి ప్రత్యేక ప్రార్థనలు చేయడం భక్తుల మదిలో చెరగని ముద్ర వేసింది. ప్రతిరోజు గాయక బృందాలు ఆలపించిన గేయాలాపనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపాయి.

# ప్రజా ఉద్యమాలకు సిద్ధం కండి

- -సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రజా ఉద్యమాలకు సిపిఐ కార్యకర్తలు సిద్ధం కావాలని ప్రజా ఉద్యమాలతోనే –సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ తెలిపారు. పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని కేవలం సంపన్నులు అవినీతి పరుల కోసమే పాలన సాగుతుందన్నారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ని రాజన్నగూడెంలో ఆదివారం పార్టీ పతాకాన్ని మల్లేష్ ఆవిష్కరించారు.కమ్యూనిస్టుపార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో మల్లేష్ మాట్లాడుతూ ప్రజా –సమస్యలను పట్టించుకునే స్థితిలో పాలకులు లేరన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలోనూ,సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంలోనూ పాలకులు వైఫల్యం చెందారన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని హామీలను నిలబెట్టుకునే దిశగా పాలన సాగడం లేదన్నారు.ముఖ్యంగా మహిళలకు –ఇచ్చిన నెలకు రూ.2,500, తులం బంగారం పథకాలను వెంటనే అమలు చేయాలని మల్లేష్ డిమాండ్ చేశారు. –సంక్షేమ పథకాలకు సంబంధించి పింఛన్ పెంపు, పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని మల్లేష్ తెలిపారు.నగర ప్రజలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని, ఇండ్లు లేని నిరుపేదలకు –ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, జిల్లా కౌన్సిల్ సభ్యులు వరదా నర్సింహారావు, స్థానిక సిపిఐ నాయకులు నజీర్, జానిమియా,మదార్ సాహెబ్,జొన్నలగడ్డ వెంకన్న, హుస్సేన్మియా,చాంద్మియా,నాగనబోయిన నాగేశ్వరావు,పోతురాజు వెంకటేశ్వర్లు,ఆముదల వెంకన్న, పాల్గొన్నారు.